గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలు

జహీరాబాద్, జనవరి 18: జహీరాబాద్ మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాళ్లు జె.రాములు, కేఎస్.జమీల్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అల్గోల్ మైనార్టీ బాలుర కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ) నీట్, ఎన్‌డీఏ కోర్సుల్లో చేరుటకు అర్హత పరీక్ష, ఇంటార్వ్యూ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం మైనార్టీలకు 51 సీట్లు, క్రైస్తవులకు 5, జైన్, పార్సీ, బుద్ధులు, సిక్కులకు 4 సీట్లు, నాన్ మైనార్టీ విద్యార్థులకు 20 సీట్లు, బీసీ 10, ఎస్సీ 5, ఎస్టీ 3, జనరల్‌కు 2 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతి బాధాకరం

కోహీర్, జనవరి 18: మండలంలోని గొటిగార్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మైసని శంకర్(59) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం గొటిగార్‌పల్లికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.నర్సింహులు, బిలాల్‌పూర్ సర్పంచ్ నర్సింహులు, కార్యకర్తలు ఉన్నారు.

శంకర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యేకు అయోధ్య అక్షింతలు

సంగారెడ్డి, జనవరి 18: అయోధ్య రాముడి అక్షింతలను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అయోధ్య ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి కండువాతో ఘనంగా సత్కరించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ని సత్కరించి రామయ్య అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంబరీశ్ జగన్‌శేఖర్, వీరేశం, రవి, వెంకటేశ్వర్లు, రవి, కౌన్సిలర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు అయోధ్య అక్షింతలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అన్నారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

గుమ్మడిదల, జనవరి 18 : అన్నారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 261 అసైన్డ్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. అసైన్డ్ భూమిలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు బుధవారం పరిశీలించిన తహసీల్దార్ గంగాభవాని గురువారం జేసీబీలతో ఆ నిర్మాణాలను దగ్గరుండి కూల్చివేయించారు. వ్యవసాయం కోసం కేటాయించిన భూముల్లో నిర్మాణాలు ఎలా చేపడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తే పట్టాలు క్యాన్సిల్ చేసి భూములను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంగీత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలిగిస్తున్న తహసీల్దార్ గంగాభవాని

బిల్లులు చెల్లించాలని ధర్నా

కంగ్టి, జనవరి18: పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం కంగ్టి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మాణిక్యం మాట్లాడుతూ కొన్ని నెలలుగా కార్మికులకు బిల్లులు రావడం లేదని, దీంతో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జూబేర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, కేవీపీఎస్ మండలాధ్యక్షుడు రాహుల్, ఎస్ఎఫ్ఐ మండల ఇన్‌చార్జి పవన్, మధ్యాహ్న భోజన కార్మికులు గంగామణి, శోభ, మోతీబాయి, లక్ష్మీ, సంగమ్మ, సావిత్రిలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులు

గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'

అమీన్‌పూర్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర గురువారం మండలంలోని దయారా, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ జాయింట్ సెక్రెటరీ పొసామిబసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయనే దానిపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ అధికారి, మండల వైద్యాధికారులు, సర్పంచులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ జాయింట్ సెక్రెటరీ పొసామిబసు

క్రీడాకారుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 18: క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో 34వ మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైత్రి క్రికెట్ క్లబ్ లో ఆడిన క్రికెటర్లు దేశస్థాయిలో గుర్తింపు పొందుతున్నారన్నారు. పటాన్‌చెరు పట్టణ యువకులకు మైత్రి స్టేడియంకు ప్రత్యేక అనుబంధం ఉంటుందని తెలిపారు. మైత్రి మైదానంను రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నారు. 34ఏండ్లుగా మైత్రి క్రికెట్‌క్లబ్ తన విజయప్రస్థానాన్ని కొనసాగిస్తున్నదన్నారు. అనేకమంది క్రీడాకారులను తయారు చేసిన ఘనత ఈ క్లబ్‌కు ఉందని కొనియాడారు. ఏడాది పొడవునా అనేక క్రీడాపోటీలు ఇక్కడ జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, కే సత్యనారాయణ, పుష్పానగేశ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ సఫానదేవ్, ఎస్సార్ గ్రూప్ ఎండీ సత్యనారాయణరెడ్డి, గోదావరి అంజిరెడ్డి,గూడెం మధుసూదన్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

మైత్రి టోర్నమెంట్‌ను టాస్ వేసి ప్రారంభిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

శేకాపూర్‌లో పాత పంటల జాతర

జహీరాబాద్, జనవరి 18: చిరుధాన్యాల్లో అధిక పోషకాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ పాత పంటలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారని డీడీఎస్ మహిళా సంఘం సభ్యులు తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని శేకాపూర్ గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాత పంటల జాతర నిర్వహించారు. 23ఏండ్లుగా పాత పంటల జాతర నిర్వహించడం సంతోషంగా ఉన్నదని డీడీఎస్ మహిళా సంఘం సభ్యులు తెలిపారు. రైతులు తమకు ఉన్న వ్యవసాయ భూముల్లో పాత పంటలు సాగు చేస్తున్నారని చెప్పారు. సన్న, చిన్నకారు రైతులకు ఉన్న ఎకరా, రెండు ఎకరాల్లో సజ్జలు, సామలు, రాగులు, కొర్రలు, జొన్నలతోపాటు ఇతర చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నారన్నారు. పాత పంటల ఆహారంతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు. చిరుధాన్యాలతో పశువులకు మేత లభిస్తుందన్నారు.

పాత పంటలు వాతావరణంలో మార్పులు వచ్చినా తట్టుకుంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ నర్సింహులు, డీడీఎస్ ప్రతినిధులు బాలయ్య, విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్, నర్సమ్మ, చుక్కమ్మ పాల్గొన్నారు.

శేకాపూర్‌లో పాత పంటల జాతర నిర్వహిస్తున్న మహిళా రైతులు

సంబురాలు జరుపుకోవాలి

కంగ్టి, జనవరి 18: అయోధ్యలో జరిగే విగ్రహప్రతిష్ఠాపన రోజు 22న దేశమంతటా దీపావళి పండగలా సంబురాలు జరుపుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇదివరకే అన్ని గ్రామాలకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు చేరాయని, మరికొన్ని గ్రామాల్లో పంపిణీ కొనసాగుతున్నదని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 10 స్థానాలకు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశా రు. అధిష్ఠానం ఆదేశిస్తే జహీరాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తానని తెలిపారు.

సేవాభావంతో మోక్షం

కంగ్టి, జనవరి 18: భక్తి, సేవాభావంతోనే మనిషికి మోక్షం లభిస్తుందని మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన చంద్రశేఖర్ మహరాజ్ అన్నారు. బుధవారం రాత్రి కంగ్టిలోని స్థానిక హనుమాన్ మందిరం వద్ద కీర్తన కాలక్షేపాన్ని చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు బానిలపై అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రతి రోజూ గంటపాటు దైవనామ స్మరణ చేయాలని సూచించారు. అంతకుముందు గ్రామస్తులు చంద్రశేఖర్‌మహరాజ్‌కు శాలువా, పూలదండలతో సత్కరించారు.

ఆరోగ్యానికి క్రీడలు తొలి మెట్టు

సంగారెడ్డి, జనవరి 18: క్రీడలు సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయవాదుల క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం ఉన్నవారికి దవాఖానలతో పని ఉండదన్నారు. ప్రతిఒక్కరూ వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియూయేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణ, బాలరాజు, మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, అరుణకుమారి, రాంరెడ్డి, దయాకర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన

రాయికోడ్, జనవరి 18: మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ నిర్మాణానికి మండల పరిధిలోని సింగి తండ్రామ శివారులో స్థలాన్ని పరిశీలించామని మాజీ జడ్పీటీసీ అంజయ్య తెలిపారు. గురువారం సింగితం గ్రామంలోని సర్వే నంబర్ 157లో ఎకరం అనుకూలంగా ఉం టుందని చెప్పారు. వారి వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఉప తహసీల్దార్ విజయకుమార్, ఆర్ఐ ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు ప్రభాకర్‌చారి ఉన్నారు.

వట్‌పల్లిలో

వట్‌పల్లి, జనవరి 18: మండల కేంద్రంలో 50పడకల దవాఖాన నిర్మాణానికి గురువారం రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మంత్రి పరిశీలన అనంతరం పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

స్థలాన్ని పరిశీలించిన అజయ్ కుమార్

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సంగారెడ్డి, జనవరి 18: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ రాములు అన్నారు. గురువారం పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదచారులు జీబ్రా లైన్ల వద్దనే రోడ్డు దాటాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దన్నారు. బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను గ్రూపులుగా విభజించి పట్టగణంలోని ప్రధాన కూడళ్ల వద్ద అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశం, ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదార్ సులఖన్ సింగ్, నాయబ్ సుబేదార్ మం గత్‌సింగ్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మనోజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు జగదీశ్వర్, పద్మజ, సిద్దులు, అభిజిత్, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఊట్ల పెద్దచెరువుకు పొంచి ఉన్న ముప్పు

జిన్నారం, జనవరి 18: ఊట్ల గ్రామంలోని పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. ఊట్ల, మంగంపేట గ్రామాల వైపు ఉన్న రెండు అలుగులు ప్రమాదకరంగా మారాయి. ఊట్ల అలుగు వద్ద చెరువు నుంచి కిందికి పారే నీటి కోసం కల్వర్టులాగా కట్టిన పెద్ద దిమ్మె ఒకపక్క కూలిపోయింది. మరోపక్క ఒరిగింది. దిమ్మెకు ఆనుకొని వేసిన సీసీ రోడ్డు కింద మట్టి కొట్టుకుపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొంది. మంగంపేట అలుగు వైపు బుంగ పడి గండిగా మారింది. దీనిని బాగు చేసే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండాపోయింది. అలుగులు చాలా వరకు ధ్వంసం అయ్యాయి. రెండు అలుగులు ప్రమాదకరంగా మారిన విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు చెప్పినా ఎలాంటి ప్రయోజనం లేదని ఊట్ల గ్రామ మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చెరువు అలుగు విషయంపై కలెక్టర్‌ను కలిసి విషయం తెలిజేస్తామన్నారు.

ధ్వంసం అయిన అలుగు రాళ్ల కట్టడాలు

గ్యాస్ రీఫిల్లింగ్ స్టేషన్లపై చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్

సంగారెడ్డి, జనవరి 18: జిల్లాలో భారీగా గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ జరుగుతున్నదని, వాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చిన్న సిలిండర్ల వినియోగదారులకు న్యాయం చేయాలని జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాన్ని జడ్పీ సీఈఓ ఎల్లయ్య ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు 5వ స్థాయీ సంఘం(స్త్రీ, శిశు సంక్షేమం), మధ్యాహ్నం 12 గంటలకు 6వ స్థాయీ సంఘం(సాంఘిక సంక్షేమం), మధ్యాహ్నం 2.30గంటలకు 3వ స్థాయీ సంఘం(వ్యవసాయం)పై సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గ్యాస్ రీఫిల్లింగ్ దందా ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులకు సమాచారం ఉండటంలేదని, అదే టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఎలా ఉంటుందని అధికారులను నిలదీశారు. యాసంగిలో సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదన్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలో సకాలంలో రైతుబంధు అందేదని, ప్రస్తుత ప్రభుత్వం దానిపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు పంటలు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారన్నారు. సమావేశాల్లో సభ్యులు పుష్పబాయి, పద్మావతి, వినీల, రాందాస్, స్వప్నకుమారి, శ్రీదేవి, జడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి స్వప్న, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

సదాశివపేట, జనవరి 18: సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. గురువారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన పత్రాలను సభ్యులు అందజేశారు. బల్దియాలో 26 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 22 మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అందుబాటులో ఉండకపోవడం, అంతా చైర్‌పర్సన్ కుమారుడు పెత్తనం చెలాయించడంతో కౌన్సిలర్ అపర్ణపాటిల్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నామని తెలిపారు. మున్సిపాలిటీకి పెద్దఎత్తున నిధులు వచ్చినా అభివృద్ధి చేయకపోవడంపై అవిశ్వాసం పెడుతున్నట్లు చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మాన పత్రాలను కలెక్టర్, రాష్ట్ర మున్సిపల్ శాఖకు పంపిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అవిశ్వాసంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు అవిశ్వాస తీర్మానపత్రాలను అందజేస్తున్న కౌన్సిలర్లు

జోగిపేట సర్కారు దవాఖానలో

మరిన్ని వసతులు

అందోల్, జనవరి 18: జోగిపేట ప్రభుత్వ దవాఖానలో మరిన్ని వసతులు కల్పించనున్నామని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం దవాఖానను సందర్శించినట్లు తెలిపారు. దవాఖానలో ఉన్న సమస్యలను సూపరింటెండెంట్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. తనిఖీలో భాగంగా శానిటేషన్ సంక్రమంగా లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపు జాబ్‌మేళా

సంగారెడ్డి, జనవరి 18: జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి వందన గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ కంపెనీలో 160 ఉద్యోగాల భర్తీకి ఈనెల 20న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పట్టణంలోని బైపాస్ రోడ్డులోని పాత వెలుగు కార్యాలయ ప్రాంగణంలో జాబ్‌మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 ఏండ్లలోపు లోపు ఉండాలని, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.45 వేల వరకు వేతనం ఉంటుందని, ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్ర తులతో నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 08455-271010ను సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి ఉర్సు

రాయికోడ్, జనవరి 18: నేటి నుంచి 22వ తేదీ వరకు మండల పరిధిలోని హస్నాబాద్ హజ్‌రత్ శంషీర్ దర్గా ఉర్సు నిర్వహిస్తామని ఎంపీపీ మమతాఅశోక్‌కుమార్, సర్పంచ్ హనుమంతులు తెలిపారు. ఉర్సులో చివరి రోజు 22వ తేదీన కుస్తీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

న్యాల్‌కల్, జనవరి 18: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని హద్నూర్ పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ నుంచి మహారాష్ట్రకు 107క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నట్టు నమ్మదగ్గ సమాచారం మేరకు పోలీసులు మండలంలోని గంగ్వార్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం పోలీసులు సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించారు.

మామిడిపల్లిలో 230 క్వింటాళ్లు..

కంది, జనవరి 18: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం కంది మండలం మామిడిపల్లి చౌరస్తా వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న లారీలో అక్రమంగా తరలిస్తున్న 230 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సయ్యద్ ఆబెద్‌షాపై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓటరు నమోదుపై 2కే రన్

ఝరాసంగం, జనవరి 18: ఓటరు నమోదుపై గురువారం ఝరాసంగం మండల కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. తాహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు 2కే రన్ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజీవరావు మాట్లాడుతూ ఓటు నమోదు కోసం ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ యాసిన్, సూపరింటెండెంట్ మారుతీవిఠోబా, గిర్దావర్ రామారావు, ఎస్ఐ రాజేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, ఏపీవో రాజ్‌కుమార్, ఏపీఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

న్యాల్‌కల్, జనవరి 18: మండలంలోని మాటూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న గోదావరి ఆగ్రో ప్రొడక్షన్ చక్కెర ఫ్యా క్టరీ చెరుకు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఫ్యాక్టరీ ప్రతినిధి మహేశ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మామిడ్గి, ఖలీల్‌పూర్ గ్రామాల్లో రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో తమ ఫ్యాక్టరీలో రోజుకు 2,500 మెట్రిక్ టన్నుల మేరకు క్రషింగ్ చేపట్టనున్నట్టు తెలిపారు. ఫ్యాక్టరీ కేన్ మేనేజర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా చెరుకు ప్లాంటేషన్ చేసే రైతులకు ఎకరాలకు రూ.7వేల రుణాన్ని ఇస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన కొత్త వంగడాల చెరుకు మొక్కలను సరఫరా చేస్తామని, సోలార్ కిట్లను కూడా అందజేస్తామన్నారు. సమావేశంలో ఫిల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT: ZAHEERABAD
O.S.NO. 251 OF 2020
Between:
Rukkamma ... Plaintiff
And
Smt Parvathamma @ Parvathi and others ... Defendant No. 6
PUBLIC NOTICE
As per the order of the Hon'ble Junior civil judge court at Zaheerabad vide in I.A.No. 2014 of 2023 in O.S.No. 251 of 2020 the following person is a parties as Defendant No.6.
Smt Bhagyavathi W/o Raji Reddy, aged about 36 Years, Occ: House hold R/o Kusnoor Village Raikode Mandal Sangareddy Dist. **(Defendant No.6)** publishing the news for intimation for her appearance in the above suit on 22.01.2024 by 10.30 AM. Before the Hon'ble Junior civil Judge court at Zaheerabad. Through her counsel or in person in the said date. if fails to appear before this Hon'ble court on the said date it is deemed to be set-ex-party.
By the Order
Sd/- **G. Srinivas Reddy,**
Advocate, Zaheerabad